నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 21 డిసెంబర్ 2024 | SIDDIPET

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ గ్రామ పంచాయతీ

మరో మూడు బల్దియాలు

- అసెంబ్లీలో ప్రకటన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు
- శాస్త్రీయత లేకుండా ఏర్పాటుపై ప్రజల పెదవి విరుపు
- పంచాయతీలను మార్చవద్దని డిమాండ్
- సర్పంచ్‌లు, ఎంపీటీసీల పదవులు కోల్పోయే అవకాశం
- తెల్లాపూర్, అమీన్‌పూర్ బల్దియాల్లో చేరిన గ్రామాల్లో సేవలు నిల్
- ముత్తంగి మున్సిపాలిటీలో 75రోజులుగా తాగునీరు బంద్
- పన్నుల కోసమే మున్సిపాలిటీల్లో జీపీల విలీనం అంటూ ఆరోపణలు

కొత్త మున్సిపాలిటీలుగా ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల

పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం గ్రామ పంచాయతీ

పటాన్‌చెరు నియోజకవర్గంలోని చిట్కుల్ గ్రామం

పటాన్‌చెరు, డిసెంబర్ 20: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మారుస్తామని శుక్రవారం అసెంబ్లీలో ఐటీ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఈ ప్రకటనతో మూడు గ్రామపంచాయతీలతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. శాస్త్రీయత లేకుండా రాజకీయ లబ్ధి కోసం ఈ గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల జనాభా, అవసరాల దృష్ట్యా నగర పంచాయతీలుగా మార్చి, ఆ తర్వాత క్రమంగా మున్సిపాలిటీలుగా మారుస్తారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇవేవి పాటించకుండా రాజకీయ లబ్ధికోసం బల్దియాలుగా మారుస్తుండడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మూడు నెలల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీలోకి ఐదు పంచాయతీలను, అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోకి ఆరు గ్రామ పంచాయతీలను ప్రభుత్వం విలీనం చేసింది. విలీనమైన గ్రామాల్లో మున్సిపల్ సేవలు ప్రజలకు సరిగ్గా అందడం లేదు. ముత్తంగి గ్రామానికి దసరా తర్వాత తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దాదాపు 75రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ముత్తంగిలో చెత్త నిర్వహణ, మురుగునీటి వ్యవస్థ దారుణంగా తయారైంది. అధికారుల్లో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రజలకు సేవలు దూరమయ్యాయి. ముత్తంగిని చూస్తున్న గ్రామాల ప్రజలు కొత్త మున్సిపాలిటీలను ఒప్పుకోమని చెబుతున్నారు. కేవలం పన్నుల కోసమే ఈ గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఇవే కొత్త మున్సిపాలిటీలు...

పటాన్‌చెరు నియోజకవర్గంలో గుమ్మడిదల గ్రామ పంచాయతీ, మండల కేంద్రం కూడాను. గుమ్మడిదల మండలంలోని దోమడుగు, గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం, వీరన్నగూడెం గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తారని సమాచారం. జిన్నారం మండలంలోని గడ్డపోతారం, చెట్లపోతారం, అలీనగర్, కిష్టయ్యపల్లి, దాచారం ఐదు గ్రామాలను కలిపి గడ్డపోతారం మున్సిపాలిటీగా చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఇస్నాపూర్, చిట్కుల్, పాశమైలారం గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయనున్నట్లు సమాచారం. పక్కనే ఉన్న రుద్రారం, లక్డారం గ్రామాలను కలుపాలని అధికార పార్టీ నాయకులు కోరుతున్నట్లు తెలిసింది. గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపాలిటీలుగా చేసినా సరిపోను జనాభా లేదు. అంతగా అనుకుంటే నగర పంచాయితీలుగా మాత్రం చేయవచ్చు. చదరపు కిలోమీటర్‌కు వెయ్యి జనసాంద్రత ఉంటేనే మున్సిపాలిటీలుగా చేయాలనే నిబంధన ఉంది.

ముత్తంగిలో తాగునీరు లేదు...

మున్సిపాలిటీలుగా మార్పు చెందితే నాణ్యమైన సేవలు పొందుతారని అధికారులు, ప్రభుత్వాలు చెబుతున్నాయి. మూడు నెలల కిత్రం ముత్తంగి గ్రామాన్ని తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దసరా పండుగ తరువాత ముత్తంగి గ్రామానికి మిషన్ భగీరథ నుంచి వస్తున్న నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలనే ఆలోచన మున్సిపల్ అధికారుల్లో రాలేదు. జాతీయ రహదారి విస్తరణలో ముత్తంగికి వస్తున్న తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయింది. దాని మరమ్మతులకు అటు మిషన్ భగీరత అధికారులు, ఇటు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోలేదు. పైగా ఈ గ్రామంలో భూగర్భజలాలు కలుషితం అయ్యాయి. మరోపక్క ముత్తంగిలోను మురుగునీటి నిర్వహణ విఫలమైంది. తడి,పొడి చెత్తను తీసుకెళ్లి సుచిర్ ఇండియా వెంచర్ ముందు గుంతల్లో పారవేసి తగలబెడుతున్నారు. దీంతో గ్రామం మొత్తం వాయు కాలు ష్యం బారిపడుతున్నది. అక్రమ నిర్మాణాలు పెరిగాయి. ప్రజాసమస్యలను వినే నాధుడే లేడు. పన్నులు అధికంగా ఉండబోతున్నాయని సమాచారం. ఇంటి పర్మిషన్లకు రెట్టింపు డబ్బులు కట్టాల్సి ఉంటున్నది. కేవలం ట్యాక్సుల కోసం, కొందరు రాజకీయ నాయకుల భవిష్యత్తు కోసం మాత్రమే మున్సిపాలిటీలు ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీల ఏర్పాటును వ్యతిరేకిస్తామని ప్రజలు పేర్కొంటున్నారు.

కొల్చారంలో గురుకుల పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు చేయండి

కొల్చారం, డిసెంబర్ 20: ఈనెల 22న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మెదక్ జిల్లా పర్యటించనున్నారు. కొల్చారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించనున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పాఠశాలను పరిశీలించారు. డైనింగ్‌హాల్, డార్మెటరీ, పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటన రూట్‌మ్యాప్‌నకు సంబంధించిన ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ గఫర్‌మియా, ఎంపీడీవో కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

ఏడుపాయల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

25న మెదక్ జిల్లాలో సీఎం పర్యటన

కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఈనెల 25న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మెదక్ చర్చి నిర్మించి వందేండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎం సందర్శిస్తారని తెలిపారు. అనంతరం పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా అమ్మవారిని దర్శనం చేసుకుంటారని తెలిపారు. శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం ఏడుపాయల అమ్మవారిని దర్శించుకునే ప్రాంతం, పార్కింగ్ ప్రదేశాలు, హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట పాపన్నపేట తహసీల్దార్, ఏడుపాయల అర్చకులు శంకర్‌శర్మ, సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

క్యాసారంలో తండ్రి చేతిలో కొడుకు హతం

కొడుకు తాగి వేధిస్తున్నాడని దాడి

వెంకట్‌రెడ్డి మృతదేహం

పటాన్‌చెరు, డిసెంబర్ 20: రోజూ మద్యం తాగి కుటుంబసభ్యులను వేధిస్తున్న కుమారుడిపై ఆగ్రహంతో తండ్రి కర్రతో దాడిచేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కొడుకు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా క్యాసారంలో చోటు చేసుకుంది. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ వివరాల ప్రకారం..క్యాసారం గ్రామానికి చెందిన అతెల్లి అనంత్‌రెడ్డి కుమారుడు అతెల్లి వెంకట్‌రెడ్డి(34) మద్యానికి బానిస అయ్యాడు. రోజూ తాగి వచ్చి తల్లితోపాటు తండ్రిపై దౌర్జన్యం చేసేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద తాగి వచ్చి కుటుంబసభ్యులతో గొడవకు దిగాడు. కొడుకు తీరుతో ఆగ్రహం చెందిన తండ్రి అనంత్‌రెడ్డి కర్రతో కుమారుడి తలపై బలంగా కొట్టాడు. దీంతో తలపగిలి తీవ్రగాయాలకు గురై వెంకట్‌రెడ్డి ఘటనా స్థలంలోనే కుప్పకూలి మృతి చెందాడు. మృతుడు వెంకట్‌రెడ్డి గతంలోనూ తల్లిపై తాగివచ్చి గొడవకు దిగినప్పుడు కేసు నమోదైంది. జైలు శిక్ష సైతం అనుభవించాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా తన ప్రవర్తన మారలేదు. ఈ హత్య క్యాసారంలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు.

కేటీఆర్‌పై రేవంత్ ప్రభుత్వం కక్ష సాధింపు

- ఫార్ములా ఈ-కారు రేస్‌లో ఎక్కడా అవినీతి జరగలేదు
- కేటీఆర్‌పై అక్రమ కేసును ఎత్తివేయాలి
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న రావుల శ్రీధర్‌రెడ్డి

సంగారెడ్డి, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసు పెట్టిందని, ఫార్ములా ఈ-రేస్‌లో ఎక్కడా అవినీతి జరగలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడంతో పాటు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు కేటీఆర్ ఫార్ములా ఈ-రేస్ ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. ఫార్ములా ఈ-రేస్ నిర్వహణతో ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్‌కు మంచి గుర్తింపు లభించడంతో పాటు రూ.700 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఫార్ములా ఈరేస్ నిర్వహణతో ఎలక్ట్రానిక్ వాహనాల తయారీ కంపెనీలు తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఫార్ములా ఈ-రేస్‌తో హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందన్నారు. కానీ, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి జరిగినటు చూపడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.55 కోట్లు తమకు అందినట్లు ఎఫ్ఈవో సంస్థ చెప్పినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఇరికించేందుకు రేవంత్ సర్కార్ కుట్రపన్నుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కేటీఆర్ ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాటం చేస్తుండడం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు మింగుడు పడడం లేదన్నారు. దీంతో ఆయనపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ఫార్ములా ఈ కారు రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై పెట్టిన కేసులో దమ్ములేనందునే అసెంబ్లీలో చర్చకు కాంగ్రెస్ ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకు రేవంత్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు సీఐడీ ఆఫీసర్లు, పోలీసులుగా ప్రవర్తిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై దుష్ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. కేటీఆర్‌పై నమోదు చేసిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింహులు, డాక్టర్ శ్రీహరి, విజయేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జీవీ శ్రీనివాస్, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి ఆదేశాలు

కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో పర్యటిస్తున్న కలెక్టర్, సీపీ

చేర్యాల, డిసెంబర్ 20: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. ఈనెల 29న మల్లన్న క్షేత్రంలో స్వామి కల్యాణోత్సవం నేపథ్యంలో కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. కల్యాణం జరిగే తోటబావి, వీఐపీ దర్శనం, శీఘ్రదర్శనం, సాధారణ దర్శనం, వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్, బస్టాండ్, ఎల్లమ్మ టెంపుల్, నూతనంగా నిర్మిస్తున్న 50 గదుల సత్రం, క్యూకాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.అనంతరం చేర్యాల, హైదరాబాద్, కరీంనగర్, సిద్దిపేట వైపు బస్సులు, ఆటోలు వెళ్లే రూట్లను పరిశీలించారు. కల్యాణం జరిగే తోటబావి వద్ద వీఐపీ దర్శనం, సాధారణ దర్శనం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, బారికేడ్లు, కల్యాణం జరిగే ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది లైటింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌పార్మర్ల చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ పై వ్యాపార వర్గాలకు అవగాహన కల్పించాలని, రాబోయే మూడు నెలలు బ్రహ్మోత్సవాలు కొనసాగనుండడంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాపారులు తమ షాపుల ముందు సామగ్రిని పెట్టి భక్తులకు ఇబ్బంది కలిగించవద్దని, షాపుల నిర్వాహకులు ముందుకు జరగకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేకంగా పెయింటింగ్ వేయించాలన్నారు.భక్తులకు 24గంటల పాటు నీటి సరఫరా ఉండేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని, మెడికల్ ఎమర్జెన్సీపై తాత్కాలికంగా స్టాల్స్ ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారికి సూచించారు.జాతరలో సౌండ్ సిస్టమ్స్‌కు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, ఐఅండ్‌పీఆర్ డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లో నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.భక్తులకు మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, ఈనెల 25లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ కమిషనర్ అనురాధ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్‌హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, ఆలయ ఈవో బాలాజీ, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్, డీపీవో దేవకీదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఏసీపీ సతీశ్, సీఐ శ్రీను, ఎస్ఐ నాగరాజు, డీపీఆర్‌వో రవికుమార్, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఐఅండ్‌పీఆర్ డీఈ భూపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీ ఏరియల్ వ్యూ

మున్సిపాలిటీగా కోహీర్

- ఏర్పాటు చేసే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం
- అసెంబ్లీలో ప్రకటన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు
- గతంలో కోహీర్ మున్సిపాలిటీనే.. జనాభా తగ్గడంతో నగర పంచాయతీగా మార్పు

కోహీర్, డిసెంబర్ 20: కోహీర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించడంపై సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కోహీర్ పట్టణ వాసుల కల నెరవేరనున్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణంలో 15,075 జనాభా ఉంది. ప్రస్తుతం 21వేల వరకు పెరిగింది. ఇండ్లు 3,082 ఉన్నాయి. పట్టణంలో 18వార్డులు ఉన్నాయి. నాలుగు ఎంపీటీసీ స్థానాలకు 8,869 మంది ఓటర్లు ఉన్నారు. అక్షరాస్యత 70.96శాతం ఉంది. కోహీర్ పట్టణం ఇంత వరకు పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు విన్నపం మేరకు కోహీర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని 2022లో అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు కూడా హరీశ్‌రావును కలిసి వేడుకున్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించారు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో అమలు కాలేదు. గత సర్పంచ్ అతియాజావిద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ప్రతులను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. మాజీ ఎంపీటీసీ అబిదాతలాత్ మరోసారి సీఎంకు లేఖను సమర్పించారు. దీంతో గతంలో బీఆర్ఎస్ అనుకూలంగా ఉండడంతో ఇప్పటి ప్రభుత్వం మున్సిపాలిటీని చేసేందుకు అంగీకరించింది. తద్వారా ప్రభుత్వం నుంచి నిధులు పుష్కలంగా లభించనున్నాయి. పన్నుల వసూలు అభివృద్ధికి దోహద పడనున్నదని ప్రజాప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారు.

గతంలో కోహీర్ మున్సిపాలిటీనే....

జనాభా అధికంగా ఉండడంతో 1952 నుంచి 1967 వరకు కోహీర్ పట్టణం మున్సిపాలిటీగానే ఉంది. గడ్డమీది లింగారెడ్డి మొట్టమొదటి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం పలు కారణాలతో ప్రజలు వలస వెళ్లారు. సంగారెడ్డి, హైదరాబాద్, జహీరాబాద్ పట్టణానికి భారీ సంఖ్యలో వెళ్లారు. దీంతో 1968 నుంచి మేజర్ గ్రామ పంచాయతీగా మార్పు చెందింది. చివరి సారిగా షఫీయొద్దీన్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఐదేండ్ల పాటు చైర్మన్‌గా ఉన్న ఆయన 22 ఏండ్ల పాటు సర్పంచ్‌గా విధులు నిర్వహించారు. ఇది ఓ రికార్డు అని చెప్పవచ్చు. అనంతరం మగ్దుం, అబిదాతలాత్, షేక్ మోహీయొద్దీన్, ఉదయ్‌కుమార్, అర్షియాకలీం, అతియా జావిద్ సర్పంచులుగా సేవలందించారు.

ప్రజల హర్షం

కోహీర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం కోహీర్‌లోని పలు పార్టీల నాయకులు సంబురాలు నిర్వహించారు. మున్సిపాలిటీ కోసం కృషి చేసిన ప్రతిఒక్కరికీ వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, స్థానికులున్నారు.


కోహీర్‌లో సంబురాలు నిర్వహిస్తున్న పలు పార్టీల నాయకులు, ప్రజలు

గతంలో మున్సిపాలిటీగానే ఉంది...

1967 వరకు కోహీర్ మున్సిపాలిటీగానే ఉంది. వ్యాపారాల కోసం, ఉద్యోగాలు రావడం, ఆరోగ్య పరిస్థితులు సరిగా లేకపోవడంతో చాలామంది ఇతర గ్రామాలకు వలస పోయారు. అప్పటి నుంచి మేజర్ గ్రామ పంచాయతీగా ఏర్పడింది. మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

– రాచూరి కనకరత్నం, కోహీర్

నిధులు ఎక్కువగా వచ్చే అవకాశం..

కోహీర్ గ్రామ పంచాయతీని మున్నిపాలిటీగా ఏర్పాటు చేస్తే నిధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజలకు అన్ని సౌకర్యాలు సమకూరుతాయి. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను పాటిస్తాం. జీవోలు, పూర్తి వివరాలు అందాల్సి ఉంది. ఈనెల చివరి నాటికి అన్ని విషయాలు తెలుస్తాయి.

– భారతి, కోహీర్ మండల అభివృద్ధి అధికారి

సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కుట్ర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

సిద్దిపేట, డిసెంబర్ 20: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసు నమోదు చేసిందని, సీఎం రేవంత్ కుట్ర రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిద్దిపేట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరామ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు రాగుల సారయ్య, గుండు భూపేశ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ అవినీతి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తున్నదని, ఫార్ములా ఈ-కార్ రేసులో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతీకార పాలనకు, పాపిష్టి పాలనకు ఇది ఉదాహరణ అని పేర్కొన్నారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను తిట్టని రోజు లేదన్నారు. తమకు న్యాయస్థానాల మీద అపార గౌరవం ఉందని, ఉద్యమకాలంలో కూడా ఇలాంటి కేసులను ఎన్నో ఎదుర్కొన్నామని తెలిపారు. రేవంత్ ఉన్మాది లాగా వ్యవహరిస్తూ కేసీఆర్, కేటీఆర్ కుటుంబాన్ని బద్నాం చేయాలని దుర్బుద్ధితో కేసులను పెట్టిస్తున్నాడని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద నగరాలకు పరిమితమైన ఫార్ములా ఈ-కార్ రేస్ పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించడంతో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందన్నారు. ప్రభుత్వానికి దమ్ముంటే దీనిపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత కక్షతోనే కేటీఆర్‌పై రేవంత్ అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే, రేవంత్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కేసులు పెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. సమావేశంలో నాగుల ప్రశాంత్ గౌడ్, గుజ్జు రాజు, శ్రీకాంత్, రాజశేఖర్, నాగరాజు, పరశురాములు పాల్గొన్నారు.

సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట బతుకమ్మతో సమగ్ర శిక్షా మహిళా ఉద్యోగుల నిరసన

అమీన్‌పూర్‌లో రూ.45 కోట్లతో రోడ్ల నిర్మాణం

అమీన్‌పూర్, డిసెంబర్ 20: అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం శాసనమండలిలో అమీన్‌పూర్ రోడ్డు గురించి ప్రస్తావన వచ్చింది. అమీన్‌పూర్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.45 కోట్లు కేటాయించామని, సంక్రాంతిలోగా పనులు ప్రారంభించి మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్సీ కోదండరాం ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి వివరణ ఇచ్చారు. సంక్రాంతి పండుగ తర్వాత త్వరలోనే టెండర్లు కేటాయించి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.